# జ్యోతిషపు విలువలు...

రచన:
ఆర్. యం. చిదంబరం

రిజల్ట్సువచ్చాయి. సుందరం నంబరుకోసం వెదికాను. ఎక్కడా కనిపించలేదు. ఒక వేళ నాకు నంబరు సరిగ్గా గుర్తులేదేమో నన్న సందేహం కలిగి మామయ్య ఇంటికెళ్ళాను. సుందరం అరుగుమీదే వున్నాడు. అతని ముఖంలో జయచిహ్నాలు లేకపోవటంవలన నా అభిప్రాయం సరియైందనుకున్నాను.

'సుందరం! రిజల్ట్సువచ్చాయి' అన్నాను.

'అవున'న్నాడు.

'ఏమయింది?'

'తెలిసుండీ అడుగుతావే? పోయింది' కళ్ళు యెరుపుచేసుకున్నాడు. తన నెంబరు నాకు చెప్పొద్దని మామయ్యతో అన్నాడట. కాని కామాక్షి పనికట్టుకునివచ్చి చెప్పింది.

'నెవర్ మైండ్ వెధవపరీక్షలు. మార్చి కాకపోతే అక్టోబరు, అదికాకపోతే సెప్టెంబరు. మన యం. యస్. యం. ఎక్కడ పోతుంది?' అని కసికొద్దీ అన్నాను.

'ఎన్నైనా చెబుతావు. ఆగతి నీకుపడితే తెలుస్తుంది' అని ఫైరయ్యాడు.

నవ్వుకుంటూ వెళ్ళిపోతుంటే 'జయాపజయాలు దైవాధీనం అతను మాత్ర మేం చేస్తాడు? అతన్ని కోప్పడి ఏం లాభం?' అన్న మామయ్యమాటలు వినిపించాయి.

సుందరం నామాటలకు ఎడార్థాలు పెడార్థాలు ఎందుకు తీస్తాడో, అచ్చికబుచ్చికగా ఎందుకుండడో, నేను ఎదురవగానే మొహం అటు ఎందుకు తిప్పుకుంటాడోమాత్రం బోధపడదు. కామాక్షి, నేను కలిసిమెలిసి తిరగటం అతనికిష్టంలేదేమో!

అసలు మామయ్య కుటుంబంతీరే చాలా చిత్రమైనదని ఇప్పుడిప్పుడే అర్థమవుతూంది. మాతో కలిసి మెలిసి తిరిగేది ఒక్క కామాక్షి మాత్రమే. సుందరం మేమంటే కళ్ళల్లో నిప్పులు పోసుకుంటాడు. అమ్మ, అత్తయ్య తరచు రాముడిగుడిదగ్గర కలుసుకుంటారు. అత్తయ్య ద్వంద్వార్థాలతో మాట్లాడుతుందని ఎన్నడూ హృదయం విప్పి మాట్లాడదని అమ్మ చెప్పింది. వీళ్ళ విముఖత ఎదనుగు తలపుకు వచ్చినప్పుడల్లా కామాక్షికీ, నాకూ మధ్య చైనాగోడ సృష్టిస్తారేమో నని భయపడేవాడిని. కాని మరుక్షణంలో నా ఊహాలు ఆశాచిత్రాలని నన్ను నే నూరడించుకునే వాణ్ణి.

కామాక్షి కథలపుస్తకాన్నివ్వటానికి ఆ సాయంత్రం వెళ్ళాను. ఆమె అక్కడ లేదు. ఎవరో స్నేహితురాలింటికి వెళ్ళిందట. అత్తయ్యకిచ్చేద్దామనుకున్నా. కాని, కథలు వ్రాస్తున్నందుకు అత్తయ్య కేకలేస్తుందని కామాక్షి ఓసారి అన్నట్టుగా గుర్తుకురావడం వలన వెనక్కి వచ్చేస్తుంటే అత్తయ్య లోపల్నుండి పిలిచింది. నేను రావడం పోవడం గమనిస్తున్నదన్నమాట. లోపలికి వెళ్ళి చూస్తే కట్టెలు తమను కాలుస్తున్నందుకు కోపంగా పొగచిమ్మటంవలన ఆమె కన్నీరుకారుస్తూ బాధపడుతోంది.

'అదేమిటత్తయ్యా! మంచికట్టెలు ఊరంతా అమ్ముతుంటే మీకోసం స్పెషల్ గా ఇవెక్కణ్ణుంచి వచ్చాయి?' అని సానుభూతి చూపించా.

'సుందరానికి నామాట తలకెక్కుతుందా? ఏదో దగ్గరున్న అడితికి వెళ్ళి కొనిపారేస్తాడు. నాలుగడుగులు వెడితే మంచివి లభించేవి. ఆయన కసలు తీరుబడిలేదు...సరే కాని మీ నూతినీళ్ళు మంచివేగదూ?'

'పంచదారలా వుంటాయి.'

'చూసు. ఈ యింటికి నుయ్యిలేదు. ఆ గవణమ్మ యింట్లోంచి నీరు తీసుకొస్తున్నాం. నుయ్యి ఎండిపోతోందని కనక ఆమె రావొద్దంది. రేపట్నుంచి నీళ్ళకు మీ యింటికే రావడం. ఏమంటావు?' అనడిగింది.

మా యింటికి నన్ను సర్వాధికారిగా (కాకపోయినా) అంగీకరించినందు కానందించి 'ఆమాత్రం దానికడగాలా?' అనేసి వచ్చేస్తుంటే కామాక్షి వచ్చింది. పుస్తకం ఆమెచేతిలోవుంచి 'నీ పుస్తకం ఎక్కడన్నా నలిగిపోయిందేమో! సరిగ్గా చూసుకో' అన్నాను. ఓ క్షణం పుస్తకాన్ని పరిశీలించి 'ఈ కాగితం మడతపడింది. బావకు పది రూపాయలు ఫైన్, చెల్లించకపోతే ఖైదు' అంది కిలకిల నవ్వుతూ.

'ఖైదుచేసేది నువ్వేనా?'

'ఆ మరి పోలీసులు వస్తారనుకున్నావా?'

'అయితే నాకు ఖైదే సుఖం. ఫైను చెల్లించను.'

'రేపటికి వాయిదా వేశాను' అని జడ్జీలాగంది.

టాపిక్ మార్చి 'ఇన్నికథలు ఎలా రాయగలిగావు? బుర్ర చిన్నలాగుంది' అన్నాను.

'మరే! నీ బుర్ర వ్యాకోచించి కథలు రాస్తుంటే ఆ ఇన్స్పిరేషన్ నాకూ కలిగింది. నువ్వు కట్టుకథలు రాస్తావు కాని మనం యథార్థమైనవే రాస్తాం.'

హృదయంలో ఏనాటినుండో పెరుగుతున్న ఆశావృక్షం ఓ పువ్వుపూసి మణి కాంతిని విరజిమ్మింది.

మరునాటినుంచి నీళ్ళకు కామాక్షి వచ్చేది. అత్తయ్యకాపని ఏనాడూ అలవాటు లేదు. కామాక్షిని ఏడిపించటానికి ఆమెర్రెండ నా

కున్న ప్రేమానుబంధాన్ని మరింత దృఢతరం చేసుకోటానికి అవకాశం లభించింది. ఎన్నో సార్లు బాల్చీదాచేసి, తెలియకుండా బిందె దాచేసి ఆమెకు కోపం తెప్పించి ఆనందించాను. అత్తయ్య ఎంతో అభినందించుకున్నాను.

ఓనాడుదయం కామాక్షి అమ్మనడిగి కారప్పూసగొట్టం తీస్కుపోతుంటే 'ఎందుకేమిటి?' అన్నాను. 'భోజనప్రియుల మనశ్శాంతికోసం' అనేసి వెళ్ళిపోయింది. ఆమె భావాన్ని అర్థంచేసుకోటానికి ఐదు నిమిషాలు పట్టింది. మధ్యాహ్నం గిన్నెలో మూతపెట్టుకుని కరకజ్జం పట్టుకొచ్చింది. చూసీచూడనట్టు నటించాను. నన్ను దాటిపోయేలోగా సమయానికి జడపట్టుకున్నాను. కామాక్షి నడకకు బ్రేక్ పడింది. సడన్‌గా ఆగింది.

'వదలు బావా! అష్టమానం వేళాకోళమే! గిన్నె నేలమీద పడిపోవలసింది' అని చిలిపి కోపంతో అంది.

'ముందు అదేదో మనకిచ్చి తరువాత కదలాలి. లేకపోతే ముందుకు సాగనివ్వం.'

భక్తుడిముందు దేవుడిలా అన్నాను.

'అరెరె... మరచిపోయాను. క్షమించండి ఏ వస్తువుచేసినా ముందు వినాయకుడికివ్వాలన్న సంగతి జ్ఞప్తికి రాలేదు. గణపతిగారు అపరాధం మన్నించాలి. జడవదలి మీకు కావలసింది తీసుకోండి' అని నాలిక్కొరుకుని, గిన్నె అందించింది.

'నీ కోమలహస్తంతో యియ్యవే భామా!' అన్నా జడ వదలకుండానే.

చేతుల్లో యిన్నిపోసి వెళ్ళిపోయింది. తిరిగి వచ్చేటప్పుడు మళ్ళీ జడపట్టుకునేసరికి కామాక్షికి నిజంగా కోపంవచ్చింది.

'కోపగించకు. ఇవి నూనెలో చేసినవి. నేతితో చేసినవి కావాలి' అన్నాను.

'నేతితో చేసిన వెక్కడున్నాయి?'

'ఇక్కడే తీసుకోమంటావా?' అని చిలిపిగా చూస్తూ అన్నాను.

'నేను వెళ్ళాక తీసుకుతిను. జడవదలు. అమ్మను పిలుస్తా' అని బెదిరించింది.

'అమ్మాయ్! నువ్వు నన్ను వినాయకుడన్నావు. అందుకిదే శిక్ష' అని బుగ్గమెలేసి 'వినాయకుడు బ్రహ్మచారి నిన్ను పెళ్ళిచేసుకోను పో' అని జడవదిలేసరికి 'బతికాను' అని వెళ్ళిపోయింది.

కుర్చీలో కూలబడి అంతా తలుచుకుని పావుగంట నవ్వుకున్నాను. మానవజీవితంలో ఆనందం గాలిమేడల్లోనేగా వుంది? ఎంత ప్రియమైన వస్తువైనా చేతికందేసరికి దాని ప్రత్యేకతను కోల్పోతుంది.

అనుకోకుండా కారుమబ్బులు కమ్మి హఠాత్తుగా వర్షం కురిసింది. ఆకాలంలో వర్షాలు కురవడం అలవాటైపోయింది. దీనికంతకూ కారణం దేశంలో పాపాలు పెరగడమేనని వాదిస్తాడు మామయ్య. తత్ఫలితంగా యింటినిండా వర్షం కురిసింది. దీనికి కారణం ఇంటికి అక్కడక్కడ అనవసరపు వెంటిలేటర్లుండడమే. కొంచెం బాగున్నది హాలొక్కటే. అదికూడా చెమ్మగా వుంది. గొడ్లపాకంతా తడిసిపోయింది. ఆవు చలి భరించలేక 'అంబా' అని అరుస్తోంది. తడవని గడ్డుంటే పరిచాం. ఆవు దానిమీద పడుకుంది.

ఇల్లు వేయిస్తానని ఇంటియజమానిప్పటికి రెండు నెలల్నుండి అంటున్నాడు కాని ఏనాడూ వేసినపాపాన పోలేదు. వేసవికదా అని ఊరుకున్నాం. మరునాడు ఇంటినిండా వర్షం కురవటం. తత్కారణంగా ఇంట్లిపాదీ నానా అవస్థపడడం. ఇవన్నీ నాన్న ఇంటియజమానితో చెప్పి యిల్లువేయించమన్నాడు. అతను ప్రస్తుతం కుదరదన్నాడు. మాటమీద మాటొచ్చి చిన్న వాక్‌యుద్ధం జరిగింది. ఇల్లువెంటనే ఖాళీచెయ్యమన్నాడు. ఆరునెల్లదాకా ఖాళీచెయ్యనన్నాడు నాన్న. చూద్దామంటే చూద్దామనుకున్నారు.

'ఇహ యీకొంపలో ఉండడమెలాగ?' అంది అమ్మ.

'ఈ కొంపలోనే కాదు. అసలు అద్దె కొంపలో ఉండడమే అపరాధం. ఏమయితేనా సరే, కొత్తకొంప కొనాల్సిందే! ఏనాటినుంచో అనుకుంటున్నాం. కాని జరిగేడిసిందేమిటి?' అని విసుక్కున్నాడు నాన్న.

'అవధానిగారిల్లు అమ్మతారట. సాయంత్రం ఎవరితోనో అంటుంటే విన్నాను' అని సమయానికి విషయం బయటపెట్టాను.

'అయితే బేరంచేసికొనేద్దాం తప్పదు.'

'అవధానిగారిల్లు చాలా బాగుంటుంది. విశాలమైన గదులు, ఎంత వర్షంకురిసినా చుక్కనీళ్ళు పడవు.' అని అమ్మ మా తీర్మానాన్ని సమర్థించింది.

'కలిసిరావాలి కాని అంతకంటె మంచిది దొరకదు' అన్నాడు నాన్న.

మరునాడుదయం పనుండి మామయ్య యింటికివస్తే నాన్న తాను అవధాన్లుగారిల్లు కొనదల్చుకున్న సంగతి చెప్పాడు. నేనూ అక్కడేవుండి పత్రిక చదువుకుంటున్నాను. ఆ ఘట్టంలో మామయ్య అభిప్రాయం అత్యవసరమని నాన్నకెందుకు తోచిందో?

మామయ్య క్షణం మాట్లాడలేదు. అతని ముఖంలో వింతవింత మార్పులు కనిపించాయి. నాన్న గుర్తించలేదు.

'ఇల్లు కొనడం మంచిదే! అవధానియిల్లు దివ్యంగా ఉంటుంది. అచ్చిరావొద్దూ? దాని జాగాములు పరిశీలించనీ, కంగారుపడి వ్యవహారం సెటిల్ చెయ్యొద్దు' అన్నాడు నాన్న ముఖంలోకి పరీక్షగా చూస్తూ.

'అందుకే నీతో చెప్పటం' అన్నాడు నాన్న.

మామయ్య లెక్కలువేసి గణించి చెబుతాను' అనేసి తను వచ్చినపని చూసుకుని వెళ్ళిపోయాడు.

మధ్యాహ్నం వచ్చాడు మామయ్య. నాన్న అరుగుమీద కూర్చుని ఆఫీసుఫైల్సు చూసుకుంటున్నాడు.

'రిసెర్చి అంతా పూర్తయిందా?' అనడిగాడు నాన్న నవ్వుతూ.

'ఆ ... అంతా చూశాను. అవధానిల్లు కొనటానికి ఎంతమాత్రం వీల్లేదు. అది మీకు అచ్చిరాదు. కొన్ని దుష్టశక్తులు శాశ్వతంగా ఇంట్లో నివాసముంటున్నాయి. వాటిని శాంతింపజేయలేం. అందులో ఉన్నవారు బాగుపడరు. ఏకోణంనుండి చూసినా ఇది మన కుటుంబక్షేమానికి తగదు. ఆపైన మీ యిష్టం' అన్నాడు.

మామయ్యన్న మాటలు నిజమనిపించాయి.

అవధాన్లుగారు ఆ యిల్లుకొని మూడు సంవత్సరాలయింది. అప్పట్నుంచీ ఆయనకు కష్టాలమీద కష్టాలు వచ్చిపడుతున్నాయి. భార్యపోయింది, చెట్టంత కొడుకు కన్ను మూశాడు. రెండో కొడుకు మద్రాసులో ఉంటున్నాడు. ప్రతినెల ఏదో పాతికపంపే వాడు. కానతనుకూడా తండ్రి నెదిరించి డబ్బు పంపటం మాని విముఖుడయ్యాడు. విధిలేక యిల్లు అమ్మతానన్నాడు.

మామయ్య మాటంటే చాలా గురి. కనుక నాన్న ఆ యిల్లు కొనటానికి సుతరామూ ఒప్పుకోలేదు. అమ్మకూడా సరేనంది.

సాయంత్రం ఏవో రికార్డులకోసం పెట్టె వెదకుతుంటే నా జాతకం కనిపించింది. అది పట్టుకుని మామయ్య యింటికెళ్ళాను. అత నొక్కడే అరుగుమీద పడకకుర్చీలో పడుకుని ఆకాశంకేసి చూస్తున్నాడు.

'మామయ్యా మనసు బాగుందికదూ?' అని నారాక నెరిగించాను.

'రావోయ్ కుర్చీ తెచ్చుకుని కూర్చో, ఏమిటది చేతిలోది?' అనడిగాడు లేచి కూర్చుంటూ.

కుర్చీకోసం లోపలికెళ్ళాను. కామాక్షి కుర్చీలో కూర్చుని మల్లెదండగుచ్చుతోంది.

'కామాక్షీ ! మాట' అన్నాను. 'ఏం?' అంటూ వచ్చింది. గబుక్కున కుర్చీ మడత పెట్టి బయటికివచ్చేశాను. కామాక్షి 'ఉండు నీపని చెబుతాను' అంటోంది. పెద్దగా నవ్వు కుంటూ కుర్చీవేసుకుని మామయ్యకెదురుగా కూర్చున్నాను.

'ఇది నా జాతకం. నువ్వు భవిష్యత్తంతా చెప్పేయాలి' అని జాతకం ముందుకుచాచాను.

'ఎందుకోయ్? అనవసరంగా బాధపడ టానికి. అంతా ముందు తెలుసుకుంటే మరి జీవి తంలో సరదా ఏముంటుంది?' అనడిగాడు.

'మరేం ఫర్వాలేదు. చెప్పేదాకా కది లేదిలేదు.'

మామయ్య నవ్వుతూ జాతకం అందుకుని అరగంట పరిశీలించాడు.

'నీ జీవితం చాలా సుఖవంతంగా గడు స్తుంది. నీకు మహారాజయోగముంది, పండేళ్లు ఆయును, మాంచి ఉద్యోగం దొరుకుతుంది' అని చెప్పుకుపోతుంటే—

'నా జాతకం తిరిగిచ్చేయి. నీకూ, చెట్టు కింది జ్యోతిష్కుడికి భేదం కనిపించదు' అన్నా కోపం నటిస్తూ.

'కంగారుపడకు. ఒక సంవత్సరంలో నీకు పెద్ద డిసప్పాయింటుమెంటు కలుగుతుంది. అది జీవితాంతంవరకు బాధిస్తుంది. నువ్వు అనుకున్న శిఖరాల్ని అందుకోలేవు. అయినా నీకు లోటులేదు' అని ముగించాడు.

'పెళ్ళి'సంగతి అడుగుదామనుకుని సిగ్గుపడి ఊరుకున్నా.

'అయితే నా జాతకం సరిగ్గా గణింపబడిం దని రుజువేమిటి?'

'ఇందులో రాసున్నప్రకారం అన్నీ జరి గాయి' అన్నాడు.

'మరి ఉద్యోగం ఎప్పుడవుతుంది?'

'సంవత్సరం తిరక్కుమునుపే.'

కుర్చీ లోపలికి తీసుకెళ్ళాను. కామాక్షి చాపమీద కూర్చుని పూలు గుచ్చుతోంది. కుర్చీ ఆమెముందువేసి 'రాణీగారు కూర్చో వచ్చు' అన్నాను.

'తమవెంటతీసుకుపొండి' అంది కోపంగా.

అక్కడున్న గులాబి పువ్వు తీస్తుంటే 'దాన్ని నలిపి పారేస్తారా యేమిటి?' అంది.

'ఛ ... ఛ ... గులాబీపువ్వు నెవడైనా దుర్వినియోగం చేస్తాడా?' అంటూ ఆమె తలలో తురిమాను. ఇంకా ఏదో అను కుంటుంటే అత్తయ్యపిలుపు విని లోపలికి తుర్రుమంది.

ఆశావృక్షం మరో పువ్వుపూసింది.

ఇంటికి వచ్చేసరికి ఇంటియజమాని, నాన్న అరుగుమీద కూర్చుని సరదాగా కబుర్లు చెప్పుకోటం ఆశ్చర్యాన్ని కలిగించింది. నన్ను చూడగానే అతను 'మీయింటి మరమ్మతు లేపట్నుంచే ప్రారంభం కోపగించుకోక' అన్నాడు నవ్వుతూ. నిన్నటి దెబ్బలాట తలచుకునేసరికి నవ్వు వచ్చింది.

మరునాడు నీళ్ళకువచ్చిన కామాక్షి 'మా నాన్నకు మద్రాసులో ఓ ఫోటో స్నేహితు డున్నాడు, ఎల్లుండి అతనికి పెళ్ళిట. మే మంతా ఈవేళ బయలుదేరివెళుతున్నాం' అంది.

'మంచిది. అతి జాగ్రత్తగా వెళ్ళిరా. పెళ్ళిలోకూడా జాగ్రత్తగా వుండు. చుట్టూ విపరీతశక్తులుంటాయి. ప్రమాదం ప్రమాదం' అని నవ్వాను.

'నీకుమల్లే ఉంటాననుకున్నావా? నీ కన్నీ అనుమానాలే' అని కిలకిల నవ్వుకుంటూ వెళ్ళి పోతుంటే ఆమెజడ ముఖానికి తగిలింది. ప్రతీ కారంచేస్తే బిందె కాస్తా నేలమీద పడుతుం దేమోనని ఊరుకున్నా.

అనుకున్నట్టే మధ్యాహ్నం మామయ్య కుటుంబమంతా మద్రాసు వెళ్ళిపోయింది. అమ్మ వద్దంటున్నా స్టేషనుకు వెళ్ళాను.

'మళ్ళీ ఎన్నాళ్ళకు రావటం?' అని బండి కదల్తుండగా అడిగాను.

'నాలుగురోజులకు' అని నాలుగు వేళ్ళు చూపించింది. అన్న నాలుగురోజులు గడి చాయి.

సుందరం మా యింటిముందునుంచి పోతుంటే పిలిచాను ఆగాడు.

'ఇప్పుడేనా రావటం?' అనడిగాను. అవు నన్నట్టుగా తలూపాడు.

'ఎక్కడికెడుతున్నావు?' ఏదో అడగాలి కదా అనడిగాను.

'డాక్టరుదగ్గరకు' అన్నాడు సాగిపోతూ.

గబగబ అరుగుదిగివచ్చి 'ఏం? ఎవరికి జబ్బు?' అని కంగారుగా ప్రశ్నించా.

'చెల్లాయికి' అనేసి వెళ్ళిపోయాడు.

గుండె ఎందుకో తెలియకుండా గతుక్కుమంది.

'పెర్రివాడా! ఆమెకు సుస్తీచేస్తే నీ కెందుకు?' అనే దో శక్తి ప్రశ్నించింది.

'అవును. ఆమె నాహృదయరాణి. ఆమె కోసం ఎంతయినా విచారిస్తాను. చీమకుడితే యేడుస్తాను.

ఆ శక్తి విరగబడి నవ్వింది. మామయ్య యింటికెళ్ళాను.

'కామాక్షి కేమిటత్తయ్యా?' అనడిగాను.

'జ్వరం వచ్చిందిరా. ఇక్కడ్నుంచి బయల్దేరేటప్పుడే ఉందట. ఉబలాటంకొద్దీ దాచేసింది. ప్రయాణంవలన మరీ హెచ్చిపోయింది. వచ్చేటప్పుడు వళ్ళు కాలిపోయింది. ఎందుకొచ్చిన ప్రయాణం' అంది.

'దానికీవూరు నీళ్ళుపడవు. కామాక్షిది గట్టి శరీరంకాదు' అన్నాడు మామయ్య.

నాడిపట్టుకుని చూశాను. చాలా నీరసంగా వుంది. చెయ్యి అగ్గినిప్పులాగుంది. ఊరికే వణికిపోతోంది. కానేపటికి డాక్టరు వచ్చాడు. పరీక్షించాడు. 'మరేం ఫరవా లేద'న్నాడు.

నాలుగురోజులు గడిచాయి. కాని తిరుగుముఖం పట్టలేదు, ఇంకా హెచ్చిపోయింది. డాక్టరు ఉదయం, సాయంత్రం వస్తున్నాడు. సూదితోపొడుస్తున్నాడు పోతున్నాడు. కాని ఆ జ్వరంముందు డాక్టరుమందులు చిత్తుగా ఓడిపోయాయి.

ఆందోళన అధికమవుతూనే వచ్చింది. కామాక్షికి బరంపురంలో వుండగా ఒకటి రెండు సార్లిలాగే జ్వరంవచ్చి తగ్గిపోయిందని మామయ్య చెప్పాడు. కాని ఆమె వర్తమానస్థితి అందర్నీ గడగడలాడించింది. ఇరవై రోజులు గడిచాయి. కామాక్షి బ్రతుకుమీది విశ్వాసంకూడా సన్నగిల్ల నారంభించింది.

ఆనాడురాత్రి వచ్చాడు డాక్టరు. పరీక్షించి యథాప్రకారంగా మందివ్వకుండా బయటికివచ్చి నన్ను పిలిచాడు.

'ఈ వ్యాధి నా దగ్గరున్న మందులతో ఇక తగ్గదు. ఉదయం పరిస్థితి ఆశాజనకంగానే కనిపించింది. కాని ప్పుడు చాలా సీరియస్‌గావుంది. నేనొక మెడిసిన్ రాసిస్తాను. మీరు వెంటనే కాకినాడ వెళ్ళితీసుకురావాలి. ఆలసిస్తే ప్రమాదం. అనకనుకుని లాభంలేదు' అన్నాడు డాక్టరు. నేను హడలిపోయి డాక్టరు వాచీ చూశాను. టైం ఎనిమిది కావస్తోంది.

'ఇప్పుడు కాకినాడకు కార్లుండవు. ఎలాగ?' అన్నాను.

'సైకిలుమీద వెళ్ళండి. మన ఊరికున్న ఒక్కటాక్సీ ఇందాకనే కాకినాడ వెళ్ళింది. మీరు వచ్చేటప్పుడు నన్నుకూడా పిలవండి' అని చీటీరాసిచ్చి వెళ్ళిపోయాడు.

ఇదంతా విన్న మామయ్య 'సుందరం! నువ్వెళ్ళకూడదటరా?' అన్నాడు.

'ఇప్పుడెవరు వెడతారు? అందులో చీకటి రాత్రులు' అని విసురుగా జవాబిచ్చాడు.

సుందరంతీరు, అతని సోదరిప్రేమ బాగా తెలిసిన మామయ్య ఇక అతన్నేమీ అడక్కుండా లోపలికెళ్ళి పది రూపాయల కాగితం తీసుకొచ్చి చేతిలోపెట్టి 'సుబ్బన్న సైకిలు నే నిమ్మన్నానని చెప్పు ఇస్తాడు' అని మాత్రమన్నాడు. పెల్లుబికే దుఃఖభారం అతన్నిక మాట్లాడకుండా చేసింది. సుబ్బన్న సైకిలు పుచ్చుకుని శరవేగంతో కాకినాడ బయలుదేరాను.

ఒకవంక ఈ లోకంలోలేని కామాక్షిని గురించి ఆందోళన. మరొకవంక ఆమెకోసం ఇంత శ్రమపడుతున్నానుకదా అనే తృప్తి. ఈ రెంటికిమధ్య హృదయం కొట్టుకుంటోంది. ఎంతవేగంతో సైకిలు తొక్కానో నాకే తెలియదు. పరాకుగా విషాదాదిపాశాలకు లోనైపోవటంవలన మలుపుదగ్గర ఓ మోటారు లారీని ఢీకొనబోయింది. మామయ్యన్నట్టు నా కాయుష్షుండబట్టి గండం తప్పింది. పదిహేను మైళ్ళ దూరాన్ని ముప్పావుగంటలో అతిక్రమించాను. వళ్ళంతా తడిసి ముద్దగా యుండటంవలన అతిరయాన వచ్చానని తెలుసుకున్నాను. మందు కొనుక్కుని యింకా వేగంతో వెనుదిరిగాను. చేతిలోవున్న మందు సీసానుచూసి 'జొగాములు నీ చేతిలో ఉన్నాయి' అన్నాను. డాక్టర్ని కూడా సైకిలుమీద తీసుకొచ్చాను.

ఇంజక్షన్ ఇవ్వబడింది, కామాక్షికి రాత్రి రెండుగంటలకికాని మెలకువ రాలేదు. మామయ్య ఏవేవో శాంతులుచేశాడు. అత్త దేవుళ్ళకు మొక్కుకుంటూ కూర్చుంది, సుందరంమాత్రం ఏమీ పట్టనట్టు హాయిగా బయట మంచంమీద నిద్రపోతున్నాడు.

మరునాడు జ్వరం కొద్దిగా దగ్గింది. నావలనే కామాక్షి ప్రాణం నిలబడిందని మామయ్య ఎంతో పొగిడాడు. కామాక్షి క్రమంగా కోలుకుంది.

'చాలా భయపెట్టేశావు కామాక్షీ! జ్వరంగా ఉందని తెలిసికూడా ఎందుకు బయలుదేరావు?' అనడిగాను ఓనాడు,

'నువ్వు నాకోసం ఎంత తాపత్రయపడతావో చూద్దామ'ని నవ్వింది. నేనూనవ్వాను.

డాక్టరు రాకతో మా నవ్వులు ఆగిపోయాయి.

'మిస్టర్! అనవసరంగా మాట్లాడించకండి. ఆలసట ఎక్కువై వ్యాధి మళ్ళా పట్టుకుంటుంది' అని హెచ్చరించాడు.

మూడువారాలు గడిచాక కాని కామాక్షి సరిగ్గా తిరగలేకపోయింది.

హఠాత్తుగా సీతమ్మయిల్లు అమ్మకానికి వచ్చింది. దీనికి కారణం ఆమె ఆర్థికమాంద్యమే. డబ్బు చేతబట్టుకుని సమయంకోసం కాచుకూర్చున్న నాన్న ఇల్లు బేరమాడాడు. మూడువేల అయిదువందలకు ఖాయంచేశాడు. రేపు రిజిష్టరీ జరుగుతుందనగా సాయంత్రం మామయ్య వచ్చాడు.

'ఆ ఇల్లు నాక్కావాలి. ముందుముందు మా సంసారం ఎలాగుంటుందో ఏమో! నేను

ఉద్యోగస్థుడ్ని కాను. గాలిమీద బతుకుతున్నాం. నాగరికత పెచ్చే కొలదీ నా రాబడికి తరుగుతథ్యం. దీపమున్నప్పుడే ఇల్లు చక్కబెట్టుకోవాలి' అన్నాడు.

మాట కాదనలేక నాన్న సరేనన్నాడు. ఇల్లు మామయ్య కొనుక్కున్నాడు. ఆ నెల లోనే రామయ్య అమ్మిన రెండకరాలపొలం కూడా కొనుక్కున్నాడు. కాని పొలం తన పేర నుంచుకోక సుందరం పేర నుంచాడు.

ఓనాడు సాయంత్రం లైబ్రరీనుండివస్తుంటే మామయ్య పిలిచాడు. అరుగుమీద కూర్చున్నాను.

'సుందరం ఉద్యోగంకోసం తిరుగుతున్నాడోయ్!' అన్నాడు.

'నాకు తెలియదే!' అన్నా చేతులు త్రిప్పి.

'నాకూ ఈవేళే తెలిసింది. అప్పుడే ఉద్యోగ మెందుకు? ఎస్. ఎస్. ఎల్. సి. ప్యాసుకాందే ఎలా దొరుకుతుంది. ముందు పరీక్ష ప్యాసవ్వు అని చెప్పాను. కాని నా మాట వినిపించుకోడు. తప్పదంటాడు. నీ ఎరుకలో ఏమన్నావుంటే చూసి పెడుదూ?'

'చూస్తాన'న్నాను.


## శ్రీ వల్లభ గణపతి రక్ష

అగమశాస్త్రోక్తముగా షట్కోణ యంత్రములో మహాబీజములు నిర్ణయించి మూల మంత్ర జపతప హెూమాగ్ని మొదలయినది చేసి తెలిపించడమయినది. దీని మహిమ ద్రవ్యలాభము, పుత్రసంతానము, వ్యాపారం, ఉద్యోగం, స్కూల్ పరీక్ష మొదలయినది జరుగును. దీని వెల ర్పూ. 2—0—0

వి. పి. 0—10—0

విలాసం :—

శ్రీ T. సుబ్రమణ్య గుర్క్కులు,
మిరాశిదార్, (కొండ)
తిరుత్తణిపోస్టు, చిత్తూరుజిల్లా.


మా సంభాషణంతా కిటికీదగ్గర నిలబడి వింటున్న కామాక్షి లోపలికి రమ్మన్నట్టు సంజ్ఞ చేసింది. వెళ్ళాను.

'అన్నయ్యకు ఉద్యోగం చూపివ్వకు' అంది. ఆమె చాలా కోపంగా కనిపించింది.

'ఏం?' అన్నా ఆశ్చర్యపోతూ.

'చూసివ్వకు. అంతే. కారణం అడగవద్దు' ప్రభువుకుమల్లే శాసించింది.

'సరే'నంటూ వచ్చేశాను. కామాక్షి మాటలు అర్థం కాలేదు. చెల్లెలిమీద ఏవిధమైన ప్రేమ సుందరం కనబర్చకపోవటమే దీనికి కారణమై యుంటుందనుకున్నాను.

ఇంటికెళ్ళేసరికి సుందరం అరుగుమీద కూర్చునుండటం ఆశ్చర్యాన్ని కలిగించింది. సుందరం ఎప్పుడూ మా యింటికి రాలేదు. నన్ను చూసి తనంతట తాను మందహాసం చేశాడు. అతనిలో కలిగిన మార్పుకు తెల్లబోయి ప్రతిగా చిరునవ్వు నవ్వాలన్న సంగతి మరచిపోయాను.

'నీకోసమే చూస్తున్నా' అన్నాడు. అతని ప్రక్కనే కూర్చుని 'ఏం! సంగతేమిటి?' అని అడిగాను.

'ఎక్కడన్నా జాబ్సు ఖాళీవుంటే చూసి పెడతావేమోన'ని అన్నాడు ప్రార్థనాపూర్వకంగా.

'మీ నాన్న ఉద్యోగం చేయొద్దన్నాడట కదూ? ఎందుకీ రాద్ధాంతం నీకు?' అని హితబోధ చేయబోయాను.

'నీకు తెలియదు. నాన్న సంపాదన నమ్మటానికి వీల్లేదు. అదీకాక నాలుగురాళ్ళు కూడబెట్టకపోతే చెల్లాయి పెళ్ళి ఎలాగవుతుంది?'' అన్న సుందరం మాటలు చెవుల్లో గింగురుమన్నై.

సుందరం ఈవిధంగా నవ్వుతూ మాట్లాడటం తృప్తిని ఆనందాన్ని కలిగించి అతను నే ననుకున్నంత విషజ్వాలాపూరితుడు కాదని తెలుసుకున్నా. మా ఊరి శ్యామలా టాకీస్ ప్రొప్రయిటరు నన్నూ, మా నాన్ననూ బాగా ఎరుగును. 'క్లుప్తంగా చెప్పాలంటే ఆయన మా ఫేమిలీమేన్. అనుకోకుండా ఆయన పార్కుదగ్గర కనిపించి మేనేజరు ఉద్యోగం వదిలేసుకున్నాడని, అతని స్థానం ఖాళీగా వుందని, నా ఎరికలో ఎవరన్నా ఉంటేనూ చెప్పమన్నారు. నేను తడుముకోకుండా సుందరాన్ని రికమెండ్ చేశాను.

'అతని కనుభవముందా?' అనడిగారు.

'లేదు. అయినా చాలా తెలివైనవాడు. హుషారైనవాడు. అంతా నాలుగురోజుల్లో నేర్చుకుంటాడు, మీ టాకీసుకు ఘనకీర్తి తెస్తాడు' అని గట్టిగా నచ్చచెప్పి ఒప్పించాను. సుందరం ఈవార్తవిని ముఖం చేటంత చేసుకుని 'థాంక్స్' అన్నాడు. నాలో గర్వరేఖ పొడసూపింది.

'జీతం ఎంతిస్తారు?' అని అనుమానంగా అడిగాడు.

'యాభై. మంచి ప్రాస్పెక్ట్సువున్నాయి. ప్రొప్రయిటరు ఆదరణ సంపాదించావంటే అనతి కాలంలో సినిమా రిప్రజెంటేటివ్‌గా వెళ్ళొచ్చు. ఆపైన అంతా అదృష్టమే!'

సుందరం అంగీకరించి వెంటనే ఉద్యోగంలో చేరాడు. నీళ్ళకు వచ్చిన కామాక్షి 'అతని కుద్యోగమెందు కిప్పించావ్?' అని నిలదీసి అడిగింది.

'అబ్బే! నువ్వన్నమాట ఎన్నడైనా జవదాటానా? అతనే సంపాదించుకున్నట్టున్నాడు. నాకేంపట్టింది?' అని చిన్న అబద్ధం ఆడాను.

'నువ్వు నా దగ్గర కొయ్యక్కరలేదు. అన్నయ్యే చెప్పాడు!' అన్నా చెల్లెళ్ళ మధ్య ఈ జగడమెందుకో బోధపడలేదు.

(ఇంకా వుంది)

---

## అతి తెలివి

తెలుగుమేష్టారు:—'పతివ్రత' అనగా ఏమిటిరా?

గోపాల్:— పతివ్రత అనగా ఒకే భర్త గలిగి వానియందే ప్రేమవుండి, భర్తే దైవమని కొలిచేటటువంటి స్త్రీ అన్నాడు.

తెలుగుమేష్టారు:—'మహాపతివ్రత' అనగా ఏమిటిరా? అని మళ్ళీ అడిగారు.

గోపాల్:—మహాపతివ్రత అనగా ఎక్కువమంది భర్తలుగలిగి వారందరిమీద ప్రేమతో వుండి, వారే దైవమనికొలచే స్త్రీ అని జవాబిచ్చేడు. కునుమంచి వెంకటేశ్వరరావు